# అహంకారంతోనే రేవంత్ వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టడం ఎవరితరమూ కాదు
- సికింద్రాబాద్ ఎంపీ స్థానం గులాబీదే
- ఎమ్మెల్యేలు, గోపీనాథ్, ముఠా గోపాల్



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను బొంద పెడుతామంటూ సీఎం రేవంత్ రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ఏం చేయలేరని, అది ఎవరితరం కాదని పేర్కొన్నారు. సీఎం పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం అనంతరం గోపినాథ్ మీడియాతో మాట్లాడుతూ... రాజధాని ఓటర్లు అభివృద్ధికి పట్టం కట్టారని కొనియాడారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి అసెంబ్లీ ఓట్ల ఆధారంగా చూస్తే బీఆర్ఎస్ భారీ ఆధిక్యంలో ఉన్నదని తెలిపారు. ఇదే ఓటింగ్ సరళి కొనసాగాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను 100 రోజుల తరువాతే అడుగుతామని స్పష్టం చేశారు. కేటీఆర్ ఓపికగా కార్యకర్తల అభిప్రాయాలు వింటున్నారని చెప్పారు. కార్యకర్తలను కాపాడుకుంటామని, ఇలాంటి చర్చలు పార్టీలో చాలా అవసరమని గోపీనాథ్ పేర్కొన్నారు. తాము రేషన్ కార్డుల కోసం ప్రజలను లైన్‌లో నిలబెట్టలేదని, అయినా ఆరు లక్షల కార్డులను ఇచ్చామని గుర్తుచేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ సీటును బీఆర్ఎస్ కైవసం చేసుకొంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెప్పారు.




చేర్యాల పెయింటింగ్ కళాకారులు రాకేశ్, వినయ్ జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ వేసిన టీషర్టును తెలంగాణభవన్‌లో శనివారం ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాగంటి గోపీనాథ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, తెల్లం వెంకట్రావ్, కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

# చేర్యాల పెయింటింగ్ కళాకారులకు కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): టీషర్టులపై జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) చేర్యాల పెయింటింగ్ వేసిన కళాకారులు రాకేశ్, వినయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అభినందించారు. రాకేశ్, వినయ్ రూపొందించిన టీషర్టులను శనివారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. ఇలాంటి వినూత్న పద్ధతులతో సంప్రదాయ కళలకు మరింత డిమాండ్ వస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. వీటికి ఆన్‌లైన్ మార్కెటింగ్, బ్రాండింగ్ అవసరం ఉన్నదని సూచించారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ పొందిన చేర్యాల పెయింటింగ్ వంటి ఉత్పత్తులకు ప్రచారంతో కళాకారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వివరించారు.

## లోకం పోకడ




# కాంగ్రెస్ ఏక్‌నాథ్‌షిండే..రేవంత్

మొదటిపేజీ తరువాయి...

ఎందుకు బొంద పెడుతవ్? తెలంగాణ తెచ్చినందుకా? తెలంగాణను అభివృద్ధి చేసినందుకా? మిమ్మల్ని, మీ దొంగ హామీలను ప్రశ్నిస్తున్నందుకా? బీఆర్ఎస్‌ను బొంద పెట్టే సంగతి తర్వాత చూసుకుందాం.. 100 రోజుల్లో నెరవేరుస్తామన్న మీ హామీలను అమలు చేసే అంశంపై దృష్టి పెట్టండి. అహంకారంతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి లాంటి నాయకులను బీఆర్ఎస్ తన ప్రస్థానంలో చాలా మందిని చూసింది. మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీ అని మీలాంటోళ్లు చాలామంది నీలిగింద్రు. అయినా రెండున్నర దశాబ్దాలు పార్టీ నిలబడి, రేవంత్ లాంటి వాళ్లను మట్టికరిపించింది' అని తెలిపారు. గతంలో అదానీ గురించి అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఆయన వెంటపడుతున్నారని, దావోస్‌లో అదానీతో అలయ్ బలయ్ చేసుకున్నారని విమర్శించారు. అదానీతో రేవంత్‌రెడ్డి చేసుకొన్న ఒప్పందాల అసలు గుట్టు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ అదానీకి వ్యతిరేకంగా మాట్లాడితే, రేవంత్‌రెడ్డి అదానీ కోసం అర్రులు చాస్తున్నారని ధ్వజమెత్తారు. డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అన్న రేవంత్.. ఇప్పుడు ట్రిపుల్ ఇంజిన్‌గా మారారని విమర్శించారు.



తెలంగాణభవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### కరెంటు బిల్లు కట్టొద్దు

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్తు పథకం గృహజ్యోతి హామీని నెరవేర్చేదాకా ప్రజలెవరూ జనవరి నెల కరెంటు బిల్లులు కట్టవద్దని కేటీఆర్ సూచించారు. సీఎం, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టుగానే ఉచిత విద్యుత్తు కోసం డిమాండ్ చేయాలని తెలిపారు. కరెంటు బిల్లులు అడిగితే అధికారులకు సీఎం మాటల వీడియోలు చూపించాలని కోరారు. కరెంటు బిల్లులు సోనియా గాంధీ కడుతుందని ఎన్నికలప్పుడు రేవంత్ చెప్పారని, ఇప్పుడు కరెంటు బిల్లులను ఢిల్లీలోని సోనియా ఇల్లు 10 జన్‌పథ్‌కు పంపించాలని సూచించారు. హైదరాబాద్ నగరంలోని ప్రతి కరెంటు మీటర్‌కు వెంటనే గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కిరాయి ఇండ్లలో ఉండేవాళ్లకు కూడా ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీల నుంచి తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తే వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టంచేశారు. బీజేపీతో బీఆర్ఎస్‌కు ఏరోజు పొత్తు లేదని, భవిష్యత్తులోనూ ఉండదని కేటీఆర్ స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఐదు ఏండ్లలో ఏం చేశారో చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడితే, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో లిఫ్టులను జాతికి అంకితం చేశారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకున్నది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీనే అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ వల్లనే బీజేపీ సీనియర్ నాయకులు హైదరాబాద్ పలు నియోజకవర్గాల్లో పోటీకి వెనుకంజ వేశారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని గుర్తుంచుకోవాలని అన్నారు. ఓడినా, గెలిచినా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజాపక్షమేనని, కేవలం 50 రోజుల కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకొని అనేకమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. 420 హామీలని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేసేదాకా వెంటాడుతామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు సముచిత స్థానం

- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషితోనే బీఆర్ఎస్ వైపు రాజధాని ఓటర్లు
- పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): పురపాలకశాఖ మంత్రిగా కే తారక రామారావు జీహెచ్ఎంసీ పరిధిలో చేసిన అభివృద్ధి, కృషి కారణంగా రాజధాని ఓటర్లు బీఆర్ఎస్ వైపు ఆకర్షితులయ్యారని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో కేకే మాట్లాడుతూ కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని, జెండా మోసిన వారికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఉద్యమకారుల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించామని, వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో హైదరాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు హీరోలని, ఏ గాలి కూడా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేకపోయిందని అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రజల్లోకి బాగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో యువతను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి పార్టీ మీటింగ్‌లు మండలస్థాయి నుంచి ఏర్పాటు చేసుకుందామని అన్నారు. పార్టీలో ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు అన్ని భావజాలాల వారు ఉన్నారని చెప్పారు.

## పాస్‌పోర్టు కార్యాలయానికి రేపు హాఫ్‌డే సెలవు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామ మందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో పాస్‌పోర్టు కార్యాలయానికి 22న హాఫ్‌డే సెలవు ప్రకటించామని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జే స్నేహజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం సగం రోజు సెలవుగా ప్రకటించడంతో పాస్‌పోర్టు సేవలు అందించే షెడ్యూలును మార్చామని చెప్పారు. ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు ఉన్న షెడ్యూలను, మధ్యాహ్నం 2.45 నుంచి పాస్‌పోర్టు సేవల కోసం టోకెన్లు పొందిన వారు ఆయా పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 15.3°c | 34.0°c |
| ఆదిలాబాద్ | 16.3°c | 33.0°c |
| నల్లగొండ | 17.4°c | 29.0°c |
| మెదక్ | 17.9°c | 33.2°c |
| ఖమ్మం | 18.0°c | 31.0°c |
| హైదరాబాద్ | 18.2°c | 30.6°c |
| వరంగల్ | 19.0°c | 29.0°c |
| కరీంనగర్ | 19.0°c | 29.0°c |
| నిజామాబాద్ | 21.1°c | 31.6°c |
| మహబూబ్‌నగర్ | 22.0°c | 32.4°c |

# దావోస్‌లో బోగస్!

మొదటిపేజీ తరువాయి...

ఈ కంపెనీ పెట్టారని చెప్పారు. కావలి సిద్ద లింగప్ప, శోభారాణి కూడా ఇందులో డైరెక్టర్లని తెలిపారు. వీరి మొత్తం క్యాపిటల్ రూ.1.70 కోట్లు అని, ఇందులో 31 శాతం షేర్లను గ్రాఫైట్ ఇండియాకు రూ.50 కోట్లకు విక్రయించారని, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి కంపెనీ కోటి రూపాయల రుణం తీసుకున్నదని వివరించారు. ముంబైకి చెందిన మరో సంస్థ నుంచి రూ.5.50 కోట్ల రుణం తీసుకున్నారని, మొత్తంగా కంపెనీకి వార్షిక నష్టం రూ.27.73 లక్షలని ఆయన స్పష్టం చేశారు. మూడేండ్లుగా ఎలాంటి కార్యకలాపాలు కూడా నిర్వహించలేదని తెలిపారు. ఈ లెక్కలను ఆ కంపెనీనే ప్రకటించిందని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో ప్రచార ఆర్భాటం తప్ప వాస్తవ పెట్టుబడులు లేవని అన్నారు. పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకున్న కంపెనీలు, వాస్తవాలను క్రిశాంక్ శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాకు వెల్లడించారు. దావోస్‌లో రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నదని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని చెప్పారు. దావోస్‌కు తెలంగాణ ప్రజాధనంతో వెళ్లారనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తించాలని, దావోస్‌లో కూడా 'మా కాంగ్రెస్' అంటూ సీఎం మాట్లాడటాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రతిరోజూ అదానీ గురించి, ఆయన అవినీతి గురించి మాట్లాడుతుంటారని, అవినీతికి చిహ్నం అదానీ అని రాహుల్ విమర్శించారని గుర్తుచేశారు. అవినీతికి చిహ్నమైన అదానీ తన అవినీతి సొమ్ము రూ.12,400 కోట్లు తెలంగాణలో పెట్టుబడి పెడుతున్నారా? అనేది సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. 2017లో కేసీఆర్ అదానీ పెట్టుబడులను తిరస్కరించారని, సింగరేణి, విద్యుత్తు ప్రాజెక్టులను కొనుగోలు చేయాలనే ప్రయత్నాలను నిలువరించారని గుర్తుచేశారు. అదానీకి ఒక్క పైసా సబ్సిడీ కూడా ఇవ్వలేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం కాగానే, ప్రధానిని కలవగానే అదానీ వచ్చి ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ బీజేపీకి బీ టీమ్‌గా తయారయ్యిందని దుయ్యబట్టారు. దీనిపై రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

Godi India Private Limited
Statement of Profit and Loss for the Period ended March 31, 2020

(Amounts in ₹)

| | Particulars | Note | For the Period ended March 31, 2020 |
|---|---|---|---|
| I. | Expenses: | | |
| | Employee Benefits Expense | 9 | 19,35,981 |
| | Finance Cost | 10 | 18,933 |
| | Other Expenses | 11 | 8,18,513 |
| | Total Expenses | | 27,73,427 |
| II. | Profit/(Loss) before Tax | | (27,73,427) |
| III. | Tax Expense: | | |
| | Current Tax | | - |
| V. | Profit / (Loss) for the Year | | (27,73,427) |
| VI. | Earnings per Equity Share (Per Equity share of ₹ 10/- each fully paid up) - Basic & Diluted | 12 | (64.45) |
| | Significant Accounting Policies and Notes forming part of Financial Statements | 1 - 19 | |

In terms of our report of even date.

### పెట్టుబడుల వాస్తవాలివే

దావోస్‌లో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని చెప్పుకుంటున్న కంపెనీల్లో ప్రధానమైనవి మూడేనని, ఇందులో అదానీ కంపెనీ రూ.12వేల కోట్లు, జేఎస్‌డబ్ల్యూ రూ.9 వేల కోట్లు, గోడి ఇండియా రూ.8 వేల కోట్లు అని క్రిశాంక్ తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ సంస్థ 2022లోనే రూ.9వేల కోట్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకొన్నదని చెప్పారు. అదానీ కంపెనీవి రూ.12 వేల కోట్లని, ఇక వాస్తవ పెట్టుబడులు ఎక్కడ అని క్రిశాంక్ ప్రశ్నించారు.

# ఢిల్లీలో కుస్తీ.. హైదరాబాద్‌లో దోస్తీ

- దావోస్‌లో కొండను తవ్వి ఎలుకను పట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అబద్ధాల పునాదులపై రేవంత్ రాజకీయం
- సీఎం అయినా మారని చిల్లర ధోరణి
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం



శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ విధానం ఢిల్లీలో కుస్తీ.. హైదరాబాద్‌లో దోస్తీ అన్నట్టుగా ఉన్నదని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉన్నదని అన్నారు. అబద్ధాల పునాదుల మీద రేవంత్ రాజకీయం చేస్తున్నారని, ఆయన అహంకారమే ఆభరణంగా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. కనీసం దావోస్‌లోనైనా రేవంత్ చిల్లరగా వ్యవహరించడం మానలేదని విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌తో కలిసి శ్రవణ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయానికి వేదికగా దావోస్ పర్యటనను రేవంత్‌రెడ్డి వాడుకున్నారని, రాష్ట్ర ప్రతిష్ఠను పెంచుకోవడం కంటే కూడా వ్యక్తిగత ప్రతిష్ఠ పెంచుకొనేందుకే ఆయన తాపత్రయపడ్డారని విమర్శించారు. భాష ఎలా మాట్లాడినా ఫర్వాలేదు కానీ భావం కూడా సరిగ్గా లేదని అన్నారు. ఉన్నత చదువులు చదివిన మంత్రి శ్రీధర్‌బాబును సీఎం రేవంత్ తక్కువ చేసి చూపారని తెలిపారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా రాష్ట్ర ఐటీ ఎగుమతులను రూ.57 వేల కోట్ల నుంచి రూ.2.40 లక్షల కోట్లకు పెంచారని, ఐటీలో మూడు లక్షల నుంచి 10 లక్షలకు ఉద్యోగాలు పెంచిన ఘనత కేటీఆర్‌దేనని చెప్పారు.

### దావోస్ వేదికగా అన్నీ అబద్ధాలే!

దావోస్ వేదిక మీద సీఎం రేవంత్ అన్నీ అబద్ధాలే చెప్పారని, రైతుల ఆత్మహత్యలపై అంతర్జాతీయ నేతలను తప్పుదోవ పట్టించారని శ్రవణ్ మండిపడ్డారు. దావోస్‌లో రైతుభరోసాతో పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నట్టు తప్పుడు మాటలు చెప్పారని విమర్శించారు. కానీ ఇంతవరకూ రైతు భరోసా అమలు చేయలేదని తెలిపారు. కేటీఆర్ అంతటి నేతను పట్టుకొని డూప్లికేట్ అంటారా? అంటూ రేవంత్‌పై ధ్వజమెత్తారు. అదానీ గురించి రాహుల్ పార్లమెంట్‌లో రోజుల తరబడి గంటలకొద్దీ ఆరోపణలు, విమర్శలు చేశారని, దేశాన్ని లూటీ చేస్తున్నారంటూ అదానీ వ్యవహారాలపై రాహుల్ కొట్లాడారని, జేపీసీ, సీబీఐ, ఈడీ విచారణకు డిమాండ్ చేశారని గుర్తుచేశారు. అదానీతో కలిసి ప్రధాని మోదీ విమానంలో ప్రయాణం చేసిన ఫొటోను కూడా రాహుల్ విడుదల చేశారని చెప్పారు. కానీ ఇప్పుడు రేవంత్.. అదానీతో కలిసిపోయారని, మోదీని కలిసిన తర్వాత అదానీతో అక్రమ సంబంధం పెట్టుకున్నారా? అని ప్రశ్నించారు. అదానీని రాహుల్ తిట్టడమేమిటి? రేవంత్ ఆయనతో రూ.12వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకోవడమేమిటి? అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అదానీతో కుదుర్చుకొన్న ఒప్పందంలో రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమల ఏర్పాటు ఉన్నదని, అదానీకి రక్షణ రంగం పరిశ్రమల స్థాపనలో ఏం అనుభవం ఉన్నదని రాహుల్‌గాంధీ స్వయంగా ప్రశ్నించారని దాసోజు గుర్తు చేశారు. రాహుల్ అలా మాట్లాడితే.. రేవంత్ అదానీతో రక్షణ పరిశ్రమల ఏర్పాటుపై ఎలా ఒప్పందం కుదుర్చుకుంటారని ప్రశ్నించారు. మోదీ చేతిలో తోలుబొమ్మలా రేవంత్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దావోస్‌లో అదానీ కలిసేందుకు ప్రయత్నించినా కేటీఆర్ తిరస్కరించారని గుర్తుచేశారు. ఊరు, పేరు లేని కంపెనీతో రేవంత్ రూ.8 వేల కోట్ల పెట్టుబడిపై ఎలా ఒప్పందం కుదుర్చుకుంటారని నిలదీశారు. కేటీఆర్ దావోస్ టూర్‌లో కుదిరిన ఒప్పందాలను తిరిగి రేవంత్ వల్లెవేస్తూ తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ కుదుర్చుకున్న రూ.20 వేల కోట్ల ఒప్పందాలు పాతవేనని స్పష్టం చేశారు. టీడీపీ జెండాల రెపరెపల మధ్య రేవంత్ బీఆర్ఎస్‌ను బొంద పెడతానని లండన్‌లో అన్నారని, తెలంగాణ ప్రజలు రేవంత్ తీరును గమనిస్తున్నారని తెలిపారు.

## సైబర్ నేరాలపై స్వీయరక్షణ అవసరం: డీజీపీ

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ రవిగుప్తా సూచించారు. సైబర్ నేరాల అదుపునకు ప్రజలు స్వీయరక్షణ పాటించాలని శనివారం ఎక్స్ వేదికగా కోరారు. బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని, ఓటీపీలు ఇతరులకు షేర్ చేయొద్ద ని పేర్కొన్నారు. ఏవేవో కారణాలు చెప్పి సైబర్ నేరగాళ్లు భయపెడతారని, వారికి భయపడి అడిగినన్ని డబ్బులు వేస్తే వాళ్లు మరింత రెచ్చిపోతారని చెప్పారు. కంప్యూటర్స్, ల్యాప్‌టాప్స్, ఫోన్లు, ఇతర గ్యాడ్జెట్స్‌లో తప్పకుండా యాంటీ వైరస్‌ను ఉపయోగించాలని చెప్పారు.

## 2న బీసీల చలో ఢిల్లీ

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): బీసీల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. జనగణనలో ఓబీసీ సమగ్ర కులగణన నిర్వహించాలని, చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు, మహిళా బిల్లులో బీసీలకు మహిళా సబ్ కోటా కల్పించాలనే డిమాండ్లతో చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోదీ ఓబీసీ అయినా, ఓబీసీ డిమాండ్లను పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. బీసీలకు మోదీ, బీజేపీ ప్రభుత్వం చేసిన వైఖరిని ఎండగట్టడానికి ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు.

## 2+2 భద్రత కల్పించండి

హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే అరూరి



హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు పోలీసులు భద్రత రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. 2023 డిసెంబర్ వరకు తనకున్న 3+3 సెక్యూరిటీని ఉపసంహరించడాన్ని తప్పుపడుతూ పిటిషన్ దాఖలు చేశారు. త్వరలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ ప్రచారం నిమిత్తం ప్రజల్లోకి వెళ్లనున్నానని, తీవ్రవాదుల (నక్సల్) నుంచి ముప్పు ఉన్న తనకు 2+2 భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆ పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు హోంశాఖను, డీజీపీని, ఐజీపీని, ఇంటెలిజెన్స్ విభాగాన్ని, వరంగల్ సీపీని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై సోమవారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉన్నది.

# అంతర్జాతీయ వేదికపై అవాకులా!

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లింది పెట్టుబడులకా? రాజకీయాలకా?
- పారిశ్రామిక దిగ్గజాల ముందు రాష్ట్రం పరువు తీసిన సీఎం

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, పర్యటన ఉద్దేశాన్ని మరిచి చేస్తున్న రాజకీయ విద్వేష ప్రకటనలను తెలంగాణ ప్రజలు ఈసడించుకుంటున్నారు. అంతర్జాతీయ వేదికలపై సీఎం హోదాలో అవాకులు, చెవాకులు పేలడంపై మండిపడుతున్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు రాష్ట్రం ఔన్నత్యాన్ని పెంచేలా సీఎం ప్రసంగాలు ఉండాలి, కానీ రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా రేవంత్ మాట్లాడుతున్నారని తెలంగాణవాదులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ సీఎం హోదాలో విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎప్పుడు కూడా రాజకీయాలు మాట్లాడలేదని గుర్తు చేస్తున్నారు. బ్రిటన్‌లో హలో లండన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'పులి అంట! ఇంట్లో పండుకున్నదంట! లేచి వస్తదంట! మేము కూడా దాని కోసమే ఎదురుచూస్తున్నం బిడ్డా.. మా దగ్గర బోనుంది.. మా దగ్గర వల ఉన్నది. రమ్మను పులి ని.. పులి బయటికి వస్తే బోనులో వేసి చెట్టుకు వేలాడదీసి కట్టేందుకు మా కార్యకర్తలు సిద్ధంగా ఉన్నా రు. ఒక్క వేటుకే బొక్కబోర్లా పడ్డవాళ్లు మన గురిం చి మాట్లాడుతున్నారు.. మా కార్యకర్తల శక్తి ఇప్పటికైనా మీకు అర్థం కావాలి.. ఆ అహంకారం ఏంది? ఆ బలుపేంది? ఆ మాటలేంది? ఇంక కూడా దిగినట్టు లేదు. అధికార అహంకారం తగ్గినట్టు లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ బలుపును కూడా దించే పనిని మా కార్యకర్తలు తీసుకుంటరు. పార్లమెంట్ ఎన్నికల్లో మీ నిషాన్ లేకుండా వంద మీటర్ల గోతి తీసి పాతిపెడుతాం' అని నోటికొచ్చినట్టు మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో విదేశీ వేదికలపై రాష్ట్రానికి పెట్టుబడులను రప్పించేందుకు నాటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తీవ్రంగా శ్రమించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరంపై కుదుర్చుకున్న ఒప్పందాలతో పెట్టుబడులు భారీగా తరలివచ్చాయి. ఆ వేదికలపై కేటీఆర్ చేసిన ప్రసంగాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లతో తెలంగాణ ప్రతిష్ఠ, గౌరవం పెరిగాయి. అప్పుడు కేటీఆర్ వ్యవహార శైలితో.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణవాదులు పోల్చి చూస్తున్నారు. తాను వచ్చింది పెట్టుబడులను సాధించడానికా? లేక రాజకీయాలు చేయడానికా? అనే విచక్షణను కూడా మరిచారన్న విమర్శలు వచ్చాయి.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### ఎంబీఏ ప్రవేశాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో కింది ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది.

- ప్రోగ్రామ్: ఎంబీఏ
- కోర్సు కాలవ్యవధి: రెండేండ్లు (ఫుల్‌టైం)
- విభాగాలు: మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్, బిజినెస్ అనలిటిక్స్, బ్యాంకింగ్
- ఎంపిక: క్యాట్-2023 స్కోర్, ఇంటర్వ్యూ, జీడీ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 31
- వెబ్‌సైట్: http://acad.uohyd.ac.in

### రైట్స్ లిమిటెడ్‌లో..

ప్రభుత్వ సంస్థ రైట్స్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 12
- పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్
- విభాగాలు: జియో టెక్నికల్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, సివిల్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 27
- వెబ్‌సైట్: https://www.rites.com

### ఫ్యాక్ట్‌లో...

ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్ (ఫ్యాక్ట్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 62
- పోస్టులు: సీనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, టెక్నీషియన్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 23
- వెబ్‌సైట్: https://fact.co.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకానమీ, మ్యాథమెటిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.